దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పలువురు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో 'యూనిలివర్' పెట్టుబడి

కామారెడ్డిలో పామాయిల్, సీసా మూతల యూనిట్ల ఏర్పాటు

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీ 'యూనిలివర్' తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ, రిఫైనింగ్ యూనిట్‌తో పాటు బాటిల్ క్యాప్‌ల (సీసా మూతల) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పేరొందిన 'యూనిలివర్' మన దేశంలో హిందుస్థాన్ యూనిలివర్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న విషయం తెలిసిందే. 'యూనిలివర్' గ్లోబల్ సీఈవో హీన్ షూమేకర్‌తోపాటు ఆ కంపెనీ చీఫ్ సప్లైచైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల అనంతరం ఈ ఒప్పందం ఖరారైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం తెలంగాణ పెవిలియన్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సప్లయ్ చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాల్లో ఖ్యాతి పొందిన 'ఎజిలిటీ లాజిస్టిక్స్' కంపెనీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు.

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

పరిచయం చేసే యోచనలో సెబీ ● గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే

ముంబై, జనవరి 21: గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సెబీ ఏం చేప్తున్నదంటే..

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

మార్కెట్‌కు ట్రంప్ సెగ



నష్టాలకు ప్రధాన కారణాలు

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

ముంబై, జనవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్ల లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలో నైతే 367.90 పాయింట్లు పతనమైంది.

ఇదీ సంగతి..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారిఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. ముమ్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

రంగాలవారీగా..

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్చేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520.34 కోట్లు తరిగి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90 శాతం చొప్పున నిరాశపర్చాయి. ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్ క్యాప్ 1.94

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

అత్యంత విలువైన సంస్థల్లో టీసీఎస్, ఇన్ఫీ, హెచ్‌సీఎల్

బ్రాండ్ ఫైనాన్స్ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 21: దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్ వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగోసారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లుకాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాంకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 21: హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

విప్రో కన్జ్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

గుడుంబా స్వాధీనం : నలుగురి అరెస్టు

పరకాల, జనవరి 21: పరకాల ఎక్సైజ్ పరిధిలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిని అరెస్టు చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ పి.తాతాజీ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పరకాల, పోచారం, గట్ల కనిపర్తి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పరకాలకు చెందిన సాదు సరోజన, గట్ల కానిపర్తికి చెందిన మోరె మదునమ్మ, ఆకునూరి మమత, బొమ్మ శారదకు చెందిన ఇండ్లలో గుడుంబా ఉండగా వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై సులోచన, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి, సిబ్బంది విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన గ్రామ అభివృద్ధి కమిటీ

శాయంపేట, జనవరి 21 : మండలంలోని గట్లకానిర్తి గ్రామ అభివృద్ధి కమిటీ మంగళవారం పరకాల ఏసీపీ సతీశ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. గ్రామంలో కమిటీ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ఏసీపీకి వివరించారు. ప్రజల సహకారంతో గ్రామంలో సీసీ కెమెరాలు, గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని వివరించారు. గణతంత్ర దినోత్సవం రోజున గ్రామానికి రావాలని ఏసీపీని అభివృద్ధి కమిటీ ఆహ్వానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీ10 క్రికెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కాజీపేట, జనవరి 21 : కాజీపేట పట్టణం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపి యాడ్ పాఠశాల విద్యార్థులు ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన జాతీయస్థాయి టీ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన అయాన్‌నాయక్, శివసాయి రెడ్డిలను ఆ విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, కో ఆర్డినేటర్ అష్టలున్నీసా, పీఈటీలు వికాస్, రమ్య, మహేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విరిగిన స్థానంలో నూతన స్తంభం ఏర్పాటు

నమస్తే తెలంగాణ కథనానికి స్పందన...

న్యూశాయంపేట, జనవరి 21 : హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్కు సమీపంలోని రోడ్డుపై ఓ విద్యుత్ స్తంభం విరిగి పడిపోడడంతో ''రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం..పట్టించుకోని విద్యుత్ అధికారులు..పొంచి ఉన్న ప్రమాదం'' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 19న కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన విద్యుత్‌స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేసి తిరిగి విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశారు. స్థానికులు నమస్తే తెలంగాణ పత్రికకు, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పరకాల, జనవరి 21 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో 5,6,7,8,18, 19,20వార్డులకు చెందిన వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. అర్హులకు అన్యాయం జరుగుకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుష్మ, వైస్‌చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విప్లవకారుడు లెనిన్ వర్ధంతి

మడికొండ, జనవరి 21 : మడికొండలోని రావి నారాయణరెడ్డి కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం విప్లవకారుడు లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, మాలోతు శంకర్‌నాయక్, రాసమల్ల దీన, పద్మ, సత్యలక్ష్మి, కమల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

4కిలోల గంజాయిని గుర్తించిన పోలీస్ జాగిలం

జాగిలం గుర్తించిన గంజాయినీ, బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న యాంటీ డ్రగ్స్ కంట్రోల్ పోలీస్ బృందం

కాజీపేట, జనవరి 21 : కాజీపేట రైల్వేస్టేషన్‌లో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ పోలీస్ బృందం పోలీస్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించి, రహస్య ప్రదేశంలో రవాణాకు సిద్ధంగా దాచి ఉంచిన నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం మద్యాహ్నం చోటుచేసుకుంది. యాంటీ డ్రగ్స్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వేస్టేషన్ మీదుగా పెద్ద మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులకు, యాంటీ డ్రగ్స్ కంట్రోల్ బృందానికి విశ్వనీయ సమాచారం వచ్చిందన్నారు. దీంతో పోలీస్ జాగిలాలతో రైల్వేస్టేషన్, ప్రయాణికుల బ్యాగ్‌ల తోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో 1వ నంబర్ ప్లాట్‌పాం చివరన వరంగల్ వైపున ప్రయాణికులు కూర్చునే బల్లా కింద రహస్య ప్రదేశంలో భద్రపరిచి ఉన్న బ్యాగ్‌ను జాగిలం గుర్తించిందని తెలిపారు. అప్రమత్తమైన సిబ్బంది ఆ బ్యాగ్‌ను తెరచి చూడగా అందులో నాలుగు కిలోల గంజాయి బయటపడిందన్నారు. ఆ నాలుగు కిలోల గంజాయిని రైల్వే పోలీస్‌లకు అప్పగించామని వివరించారు. ఈ తనిఖీలలో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ పోలీస్ బృందం ఆర్ఐ కేశవులు, ఆర్ఎస్ఐలు పూర్ణ, మనోజ్, నాగరాజు, సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఆరెపల్లి గోదాము వద్ద నిరసన చేపట్టిన హమాలీ కార్మికులు

ఉపాధి కల్పించాలని హమాలీల నిరసన

శాయంపేట, జనవరి 21 : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో ఉన్న గోదాం వద్ద హమాలీలు పనులు కల్పించాలని మంగళవారం నిరసన చేపట్టారు. మూడేళ్లుగా తమకు పనుల్లేక అరవై మంది హమాలీ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నామని గోదాం వద్ద హమాలీ యూనియన్ నాయకులు భోగి రమేశ్, బోగి నాగరాజు, నర్సింగరావు, తిరుపతిరెడ్డి, మొగిలి, కన్నయ్య, రామన్న, సంపత్, శ్రీను, రాజు ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో ఇక్కడ గోదాం ప్రారంభించినప్పటి నుంచి శాయంపేట, ఆరెపల్లికి చెందిన 60 మంది హమాలీలు ఇక్కడే పనిచేస్తూ పొట్టపోసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిల్లర్లు బీహార్ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. దీంతో తాము ఉపాధి లేక అవస్థలు పడుతున్నామన్నారు. తమకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాగా హమాలీ యూనియన్ నాయకులుగా వల్లెపు తిరుపతి రెడ్డి, భోగి నాగరాజును ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్, జనవరి 21 : రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీఐసీఐ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అధ్వర్యతన ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరస్తులు ఎలా మోసం చేస్తారనే అంశంపై వివరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, స్టాటస్టికల్ అధికారి ప్రసన్నకుమార్, సూరింటెండెంట్లు వేణుగోపాల్, అనిల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మడికొండ, జనవరి 21 : సైబర్ నేరాలపై పట్ల అప్రమత్తంగా ఉండాలని మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ సూచించారు. గ్రేటర్ 45వ డివిజన్ తరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆయన రోడ్ సేఫ్టీ, డయల్ 100, సోషల్ మీడియా వల్ల జరిగే దుష్పరిణామాలు, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిల్వ మద్యం పట్టివేత

కాజీపేట, జనవరి 21 : కాజీపేట పట్టణంలోని వైఎస్సాఆర్ నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకుని, అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాజీపేట ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైఎస్సాఆర్ నగర్‌కు చెందిన మోడెం కౌశిక్ ఎటువంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు మద్యం సీసాలు తీసుకొచ్చి ఎక్కువ రేట్‌కు అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మతిన్ పాషా సిబ్బందితో తనిఖీలు నిర్వహించి నిలువ ఉంచిన రూ.5,220 విలువగల మద్యం సీసాలను పట్టుకున్నట్లు తెలిపారు. కౌశిక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై కౌన్సెలింగ్

హనుమకొండ చౌరస్తా, జనవరి 21 : జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా వరంగల్-1 డిపోలో మంగళవారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించాలి, మనసు ప్రశాంతంగా ఉండే విధానాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), సేఫ్టీ వార్డెన్, ప్రమాదాలకు గురైన డ్రైవర్లు జి.ఎస్.రెడ్డి, బీ మహేందర్, ఎం బాబు, కే భద్రయ్య, ఎం శ్రీనివాస్, వీ.ఆర్.రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి

కమలాపూర్, జనవరి 21 : మండలంలోని భీంపల్లి ఆరోగ్య ఆయుష్మాన్ కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య మంగళవారం పరిశీలించారు. జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. న్యాక్ నిబంధనల ప్రకారం పూర్తి అయిన పనులు, మిగిలిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల కింద ఆరోగ్య కేంద్రం ఎంపికయ్యేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు పద్మశ్రీ, రేణుక, డీక్యూఎం సాగర్, ఏఎన్